సాక్షి ప్రకాశం

ఆదివారం । 5 । నవంబర్ । 2023



వర్షంతో రైతన్న హర్షం

జిల్లాలో వాతావరణం చల్లబడింది. పలుచోట్ల వర్షాలు కురిశాయి. ఈ వర్షం రబీ పంటలకు మేలు చేకూరుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో..



బస్సు యాత్రను విజయవంతం చేయాలి

కనిగిరిలో ఈనెల 8వ తేదీ నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31.3/19.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నేడు

- త్రిపురాంతకం కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి సురేష్

త్రిపురాంతకం: త్రిపురాంతకంలో ఆదివారం జరగనున్న ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని మండల పార్టీ కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి తెలిపారు. త్రిపురాంతకం ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈకార్యక్రమం జరుగుతుందని అన్నారు. గ్రామసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉత్తమ సేవా సర్టిఫికెట్

కురిచేడు: ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధతో వైద్యులు, సిబ్బంది నాణ్యమైన సేవలు అందించినందుకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేంద్ర ఆరోగ్యశాఖ నుంచి ఉత్తమసేవా సర్టిఫికెట్ అందజేశారు. దానిని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్యల చేతులమీదుగా వైద్యాధికారి పీ.ప్రవీణ్ అందుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి రూ.కోటి నిధులు మంజూరు

మార్కాపురం: మార్కాపురం మార్కెట్ యార్డు అభివృద్ధికి కోటి రూపాయల నిధులు మంజూరైనట్లు యార్డు ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. యార్డు భవనానికి రూ.70 లక్షలు, యార్డులో సీసీ రోడ్డు, కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని అన్నారు. మార్కెట్‌యార్డులో రైతుల కోసం సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామనీ, రైతులు తాము పండించిన పత్తిని యార్డుకు తీసుకొచ్చి అమ్ముకోవాలని, దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు పత్తిని అమ్ముకోవద్దని సూచించారు. బన్నీ రకం కనీస మద్దతు ధర రూ.7020గా కొనుగోలు చేస్తారని, 8 శాతం తేమ ఉండాలని తెలిపారు. 9 శాతం తేమ ఉంటే రూ.6949కు, 10 శాతం ఉంటే రూ.6,879.60 కు కొనుగోలు చేస్తామన్నారు.

సచివాలయ వ్యవస్థ భేష్

- సినీ నటుడు అజయ్‌ఘోష్



ఎంపీటీసీ మన్నే శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బందితో అజయ్‌ఘోష్

ఒంగోలు రూరల్/ఒంగోలు మెట్రో: గ్రామ సచివాలయ వ్యవస్థ భేషుగ్గా ఉందని, జిల్లా కేంద్రానికి వెళ్లకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామంలోనే పనులు జరగడం గొప్ప విషయమని ప్రముఖ సినీ నటుడు అజయ్ ఘోష్ అన్నారు. మండలంలోని కరవదిలో గ్రామ సచివాలయం, పొలాలు శనివారం ఆయన సందర్శించారు. పంట పొలాలను, ఇటుక రాయి బట్టీలను పరిశీలించారు. పూర్వ సర్పంచ్ మన్నే వెంకటేశ్వర్లుతో తనకు ఉన్న సన్నిహిత్యాన్ని ఆయన మనుమడు ఎంపీటీసీ మన్నే శ్రీనివాసరావుతో పంచుకున్నారు. అనంతరం అజయ్‌ఘోష్ కరవదిలోని వివేకానంద విద్యావిహార్ విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట హెచ్‌ఎం రమాదేవి, అకడమిక్ డైరెక్టర్ సాయి వివేక్ ఉన్నారు.

పంటలు పండి, చేతికొచ్చి అమ్ముకునేంత వరకు అంతా సజావుగా జరిగితే రైతు ఊపిరి పీల్చుకుంటాడు. ప్రకృతి విపత్తులు సంభవించి నష్టం వాటిల్లితే అన్నదాత తీవ్రంగా **నష్టపోతాడు.** కష్టకాలంలో మట్టి మనిషికి అండగా నిలుస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. కర్షకులను నష్టాల **నుంచి** గట్టెక్కించటానికి ఉచిత పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. అన్నదాతకు పైసా ఖర్చు లేకుండా బీమా పరిహారాన్ని అందజేస్తోంది. ఏ సీజన్‌లో నష్టాన్ని అదే సీజన్‌లో చెల్లిస్తూ భారం కాకుండా చూస్తోంది. నాలుగేళ్లలో జిల్లాలో 5 లక్షల మందికిపైగా రైతులకు రూ.889.55 కోట్ల బీమా పరిహారం అందింది

- అన్నదాతకు అండగా ఉచిత పంటల బీమా
- రైతు వాటా ప్రీమియం మొత్తాన్ని భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- నాలుగేళ్లలో బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ కింద 5,48,564 మంది రైతులకు లబ్ధి
- రూ.889.55 కోట్ల చెల్లింపు
- 2023 ఖరీఫ్‌లో 3.55 లక్షల ఎకరాల సాగు



రైతన్నకు తోడుగా

ఒంగోలు సెంట్రల్: గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పంటల బీమా అత్యంత ఖరీదుగా ఉండేది. ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియం రైతులు చెల్లించాల్సి వచ్చేది. దీంతో సామాన్య, సన్న, చిన్న కారు, మధ్య తరగతి రైతులు బీమాకు దూరంగా ఉండేవారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పుడి నుంచి రైతుల సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ఉచిత పంటల బీమా అమలు చేస్తోంది. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు బీమా పరిహారం అందుతోంది. ఈ–క్రాప్ బుకింగ్ ప్రకారం ఈ ఏడాది ఖరీఫ్‌లో అన్ని రకాల పంటలు కలిపి 3.55 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గతంలో తమకు అందిన పంట బీమాపై చర్చ జరుగుతోంది. గత నాలుగేళ్లుగా రైతన్నకు తోడుగా జగనన్న నిలచారని.. రానున్న రోజుల్లో కూడా పంట పండితే లాభం వస్తుంది.. లేదంటే ప్రభుత్వం ఆదుకుంటుంది అనే ధీమాతో రైతన్నలు పంటలు సాగు చేస్తున్నారు.

నాలుగేళ్లలో రూ.889.55 కోట్లు చెల్లింపు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఎగవేసిన క్రాప్ ఇన్సూరెన్స్ సైతం వచ్చేలా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం వచ్చిన నాలుగేళ్లలో బీమా పరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ కింద మొత్తం 5,48,564 మంది రైతులకు రూ.889.55 కోట్లు ఇచ్చారు. అందులో పంట నష్ట పరిహారం 3,46,444 మంది రైతులకు రూ.727.40 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ 2,02,120 మంది రైతులకు రూ.162.15 కోట్లు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని రైతు సంఘ నాయకులు అంటున్నారు.

ఆరు పంటలకు పైసా ఖర్చు లేకుండా బీమా: జిల్లాలో ఖరీఫ్‌లో ఆరు పంటలకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద నోటిఫై అయ్యాయి. వైఎస్సార్ పంటల బీమా వాతావరణ ఆధారితగా పత్తిని మండల యూనిట్‌గా హెచ్‌డీఎఫ్‌సీ జీఐసీ లిమిటెట్ ఇన్సూరెన్స్ అమలు చేస్తోంది. దిగుబడి ఆధారంగా గ్రామ యూనిట్‌గా వరి, మండల యూనిట్‌గా కంది, సజ్జ, మిరప, జిల్లా యూనిట్‌గా మినుమును బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ అమలు చేస్తోంది. వర్షాధారం కింద సాగు చేసిన పత్తికి వాతావరణ ఆధారిత బీమా ఉంది. హెక్టారుకి రూ.1,05,000 బీమా చేస్తారు. మార్గదర్శకాల ప్రకారం హెక్టారుకి 5 శాతం ప్రీమియం రూ.5,250 రైతు చెల్లించాల్సి ఉంది.అయితే ప్రభుత్వమే రైతు వాటాను కూడా భరిస్తోంది. అదే విధంగా మిగిలిన పైర్లకు కూడా రైతు కట్టాల్సిన వాటాను ప్రభుత్వమే చెల్లిస్తూ రైతుకు పైసా ఖర్చు లేకుండా డాక్టర్ వైఎస్సార్ పంటల బీమాను వర్తింపచేస్తోంది.

జిల్లాలో 2019 నుంచి 2022 వరకు బీమా పరిహారం వివరాలు

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	పొందిన పరిహారం (రూ.లక్షల్లో)
2019	1,30,106	23,991.81
2020	30,945	3,111.30
2021	1,12,042	27,535
2022	73,351	18,102
మొత్తం	3,46,444	72,740.11

2019 నుంచి 2022 వరకు వచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీ వివరాలు:

సంవత్సరం	లబ్ధిపొందిన రైతులు	పొందిన పరిహారం (రూ.లక్షల్లో)
2019	1,510	55.49
2020	1,53,338	11,962.28
2021	18,713	1,647.50
2022	28,559	2,550.48
మొత్తం	2,02,120	16,215.75



2019లో వర్షాలకు తడిసిన ఓదేలు (ఫైల్)



బోరు వద్ద నీటిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి, రైతులు

రైతులకు ఎంతో ఊరట



2023–24 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంట నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాం. నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే బీమా పరిహారం పరధిలోకి వస్తాయి. ఈ–క్రాప్ డేటా బీమా కంపెనీలకు వెళుతుంది. 2019–2022 వరకు రైతుల వాటా ఒక్క రూపాయి ప్రీమియం లేకుండా డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా పరిహారం అందించారు. ఇన్‌పుట్ సబ్సిడీలు కూడా అందించాం. రైతులకు బీమా ఎంతో ఊరటనిస్తుంది.

– ఎస్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి, ఒంగోలు

పంట నష్టపరిహారం ఆదుకుంది



2018లో పంట ఇన్సూరెన్స్ కింద రూ.6 వేలు డీడీ తీశాను. అయితే చంద్రబాబు పాలన ముగిసినా సరే ఇన్సూరెన్స్ నగదు రాలేదు. దీంతో ఇక రావని నిర్ధారించుకున్నాను. అయితే 2019లో సీఎం వైఎస్ జగన్ రాకతో ఒక్కసారిగా రైతులకు మేలు చేసేలా ఇన్సూరెన్స్ నగదు విడుదల చేశారు. దీంతో రూ.70 వేల వరకు నగదు వచ్చింది. తర్వాత పంట వర్షాలకు దెబ్బతినటంతో ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చింది. గత సంవత్సరం కూడా ఇన్సూరెన్స్ నగదు వచ్చింది.

– వెంకటరామయ్య, తిప్పలదేవి పల్లె రెవెన్యూ, మద్దిపాడు మండలం

రైతన్నకు తోడుగా జగనన్న ప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను అన్ని విధాలుగా ఆదుకుని వారికి తోడుగా జగనన్న ప్రభుత్వం నిలిచింది. ప్రకృతి వైపరీత్యాలు వలన పంట నష్టం కలిగినప్పుడు ఆ పంట కాలంలోనే పంట నష్టం పెట్టుబడి రాయితీ చెల్లించారు. గత 52 నెలల్లో అనేక కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2018లో నష్టపోయిన రైతాంగానికి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.182 కోట్లు చెల్లించారు. రైతాంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్క రైతు మద్దతుగా నిలబడాలి.

– మారెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రీజినల్ కోఆర్డినేటర్, జిల్లా పొగాకు బోర్డు మెంబర్

ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చింది



గతంలో పొలం నాపేరుపై లేకపోవటంతో ఇన్సూరెన్స్ నగదు కోల్పోయాను. దీంతో తర్వాత సంవత్సరం ఆన్‌లైన్ చేయించుకోవటంతో వర్షానికి పంట నష్టపోయిన సమయంలో 1.20 సెంట్లకు గాను రూ.20 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చింది.

– బిజ్జం నాగిరెడ్డి, బిజ్జవారి పల్లె, కనిగిరి మండలం

వరి దెబ్బతినటంతో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారు



వర్షాలకు ఎక్కువగా ఉండి వరి దెబ్బతింది. దీంతో రైతు భరోసా కేంద్రం నుంచి వ్యవసాయ సహాయకుడు వచ్చి పరిశీలించాడు. అవసరమైన కాగితాలు ఇచ్చాను. నాకు రూ.22 వేలు నగదు ఖాతాలో జమైంది. రైతును ఆదుకోవటంలో ప్రభుత్వం ముందు ఉంటుంది.

– వీరం రెడ్డి ఆదిరెడ్డి, లక్ష్మీనగర్, ముండ్లమూరు మండలం

అన్ని విధాలా రైతులకు అండ



రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత భరోసా ఏర్పడింది. పంట పండినట్లయితే నగదు వస్తుంది. లేదంటే ప్రభుత్వం ఆదుకుని పంట నష్టం, లేదా ఇన్‌పుట్ సబ్సిడీతో అయినా ఆదుకుంటుంది. అందుకే రైతులు ధైర్యంగా పంటలు సాగు చేసుకుంటున్నారు. రైతులకుఅన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటోంది.

– కుమ్మిత నాగిరెడ్డి, తురకపాలెం

రేపటి సామాజిక సాధికార యాత్రకు ఏర్పాట్లు పూర్తి

- ఎంపీ విజయసాయిరెడ్డి, పలువురు మంత్రులు మార్కాపురం రాక
- ఎమ్మెల్యే కేపీ వెల్లడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ, పక్కన కృష్ణ, షంషేర్, ఇస్మాయిల్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఈనెల 6వ తేదీన జరగనున్న సామాజిక సాధికార యాత్రకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తెలిపారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు రీజినల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యుడు వి.వి జయసాయిరెడ్డి, మంత్రులు మేరుగ నాగార్జున, డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి కే పార్థసారధి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తోపాటు పలువురు ముఖ్య ప్రజాప్రతినిధులు వస్తారన్నారు. సాధికార యాత్ర స్థానిక జార్జి ఫార్మసీ కళాశాల నుంచి పూలసుబ్బయ్య కాలనీలో బీసీ భవన్, అంబేద్కర్ భవన్, షాదీఖానా స్థలాలను పరిశీలించిన అనంతరం సాయంత్రం 3 గంటలకు పాతబస్టాండులోని వైఎస్సార్ విగ్రహం వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్నీ గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు ఈ సదస్సుకు హాజరుకావాలని ఎమ్మెల్యే కోరారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ ఛైర్మన్ బాల మురళీకృష్ణ, పట్టణ పార్టీ అధ్యక్షుడు, వైస్‌ఛైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఏఎంసీ ఛైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, తర్లుపాడు మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ నగేష్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, మార్కెట్‌యార్డు డైరెక్టర్ రమణారెడ్డి పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే జార్జి ఫార్మసీ కళాశాలకు వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు.

మంత్రుల పర్యటనకు భారీ బందోబస్తు

ఈనెల 6వ తేదీన మార్కాపురంలో జరిగే సామాజిక సాధికార సభకు యాత్రకు పోలీసులు భారీ బందోబస్తు కల్పిస్తున్నట్లు డీఎస్పీ జి వీరరాఘవరెడ్డి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి తెలిపారు. మంత్రుల పర్యటన, సాధికార యాత్రపై ఎమ్మెల్యే కేపీ శనివారం తన నివాసంలో పోలీసు అధికారులతో సమీక్షించారు. ముఖ్యప్రజాప్రతినిధులు హాజరవుతున్న దృష్ట్యా రూట్‌మ్యాప్‌పై సమీక్షించారు. బహిరంగ సభ జరిగే పాతబస్టాండు ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బందిలేకుండా క్రమబద్ధీకరించాలని సూచించారు. నియోజకవర్గంలోని సుమారు 100 గ్రామాల నుంచి ప్రజలు, ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు వస్తారనీ, పార్కింగ్ సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే కోరగా కొన్ని వాహనాలను టీటీడీ కల్యాణ మండపం, రాయవరం, గజ్జలకొండ, పొదిలి, కొనకనమిట్ల వైపు నుంచి వచ్చే వాహనాలను సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో, మార్కెట్ యార్డు వైపు నుంచి వచ్చే వాహనాలను సెవెన్‌హిల్స్ వద్ద ఆపి పార్కింగ్ చేయించాలని చర్చించారు. సీఐ భీమానాయక్, పట్టణ ఎస్సై కోటేశ్వరరావు పాల్గొన్నారు.



వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ మూర్తులు

కమనీయం..శోభాయమానం

నరసింహస్వామి భక్తబృందం ఆధ్వర్యంలో సింహాచల దేవస్థానం వారిచే ఒంగోలు నగరంలో మొదటిసారిగా వరాహ లక్ష్మీనరసింహస్వామి శోభాయాత్ర శనివారం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తజన సందోహం నడుమ స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు.

– ఒంగోలు మెట్రో



శోభాయాత్రలో స్వామిని కీర్తిస్తున్న భక్తులు

అండర్ 19 ఎస్‌జీఎఫ్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ 19 ఎస్‌జీఎఫ్ క్రీడాజట్ల ఎంపిక వివిధ తేదీల్లో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్, కార్యదర్శి ఎం.ఆదినారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7న ఒంగోలు ఏబీఎం జూనియర్ కాలేజీలో సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, స్విమ్మింగ్, 14వతేదీ కందుకూరు టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అథ్లెటిక్స్, త్రోబాల్, ఈనెల 16న కొనకనమిట్ల మండలం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంలో రగ్బీ, నెట్‌బాల్ క్రీడా జట్ల ఎంపిక నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో 2005 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన బాలబాలికలు మాత్రమే అర్హులన్నారు.

పక్కా ప్రణాళికతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

- కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పక్కా ప్రణాళికలు, క్రమశిక్షణ, పట్టుదలతో ప్రయత్నిస్తే భవిష్యత్తులో ఉన్న స్థానాలకు ఎదగవచ్చని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజి మూడో సంవత్సరం విద్యార్థినులతో కాఫీ విత్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభిరుచులు, ఆకాంక్షలతో పాటు కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. లక్ష్య సాధనలో పేదరికాన్ని అడ్డుగా భావించకూడదన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకునే నిరంతర కృషి ఉండాలన్నారు. తన విద్యాభ్యాసం, ఐఏఎస్ అధికారి కావాలనే లక్ష్యం ఆ దిశగా చేసిన ప్రయత్నాలను విద్యార్థినులతో కలెక్టర్ పంచుకున్నారు. కార్యక్రమంలో కాలేజి ప్రిన్సిపాల్ బీ కళ్యాణి, జవహర్ నాలెడ్జ్ సెంటర్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, లైబ్రరీ సైన్స్ లెక్చరర్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, స్టూడెంట్ కో ఆర్డినేటర్ శ్రావణి, కళాశాల సిబ్బంది సురేష్‌కుమార్, ఏడుకొండలు, రవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

- 8న కనిగిరిలో సామాజిక సాధికార బస్సు యాత్ర, భారీ బహిరంగ సభ
- ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలి
- సుమారు 20 వేల మంది హాజరయ్యే విధంగా ప్రణాళిక
- ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలి
- కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పిలుపు


రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: కనిగిరిలో ఈ నెల 8వ తేదీ నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్సిటీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపునిచ్చారు. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో స్థానిక వైఎస్సార్ భవన్‌లో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రంగనాయకులరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే బుర్రా మాట్లాడుతూ గత నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. బీసీలంటే బ్యాక్ వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని సీఎం అభివర్ణించారన్నారు. ప్రభుత్వం చేపట్టిన నవరత్నాల పథకాల్లో అత్యధికంగా జనాభాలో 60 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాల వారికి లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలతో ప్రతి ఇంట్లో రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. సీఎం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పదవుల్లో అగ్రస్థానం కల్పించిన ఘనత సీఎం జగన్‌దేనని అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, ప్రగతిని ప్రజలకు వివరించడమే బస్సు యాత్ర లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ విజయసాయిరెడ్డి, రాష్ట్ర మంత్రులు అంజాద్‌బాషా, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, జోగి రమేష్, హాఫీజ్‌ఖాన్, కొలుసు పార్థసారధి, పోతుల సునీత తదితరులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా తీసుకుని బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుర్రా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు సీహెచ్ సాల్మన్, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, వైస్ చైర్మన్లు, ఎంపీపీలు పులి శాంతి గోవర్దన్‌రెడ్డి, ఆర్.మాణిక్యరావు, లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, జీ ధనుంజయ్, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, పార్టీ జేసీఎస్ మండల కన్వీనర్లు, పార్టీ మండల అధ్యక్షులు గురుప్రసాద్, భువనగిరి వెంకటయ్య, తిరుపతిరెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, జీ బొర్రారెడ్డి, ఒకే రెడ్డి, తమ్మినేని సుజాత, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, డాక్టర్ రసూల్, కంటు గురవయ్య, రామనబోయిన శ్రీను, దాసరి మురళి, పెన్నా ఏడుకొండలు, భారతి, చెరుకూరి చినకాశయ్య, సిరుప వెంకట గోవర్దన్‌రెడ్డి, వేల్పుల వెంకటేశ్వర్లు, కాకర్ల వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే బుర్రా...

తొలుత పార్టీ శ్రేణులతో కలిసి బస్సు యాత్ర రూట్‌మ్యాప్‌ను ఎమ్మెల్యే బుర్రా పరిశీలించారు. స్థానిక పామూరు బస్టాండ్ సెంటర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి చోటా సభల్లో లబ్ధిదారులు, ప్రజలు వేల సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు. దేశంలో ఎక్కడా చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఎనలేని మేలు జరిగిందన్నారు. చేసిన మేలు ప్రజలకు వివరించేందుకే సామాజిక సాధికార బస్సు యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. కనిగిరి పట్టణంలో 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే బస్సు యాత్ర బహిరంగ సభకు సుమారు 20 వేల మంది హాజరయ్యే విధంగా ప్రణాళిక చేపట్టినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

రూట్ మ్యాప్ ఇలా...

- 8వ తేదీ ఉదయం 10 గంటలకు కనిగిరి మండలం నందనమారెళ్ల వద్ద సామాజిక సాధికార బస్సు యాత్ర కనిగిరి నియోజకవర్గంలో ప్రారంభమవుతుంది.
- 10.15 గంటలకు నందనమారెళ్ల వద్ద స్వాగత జెండా ఆవిష్కరిస్తారు.
- ఆ తర్వాత సూరాపాపిరెడ్డికాలనీలోని లారీ స్టాండ్ వద్ద అసోసియేషన్ సభ్యులతో సమావేశం.
- అనంతరం పట్టణంలోని 11వ వార్డు ఎస్టీకాలనీలో ఎస్టీ వాసులతో సమావేశం.
- చెక్‌పోస్టు వద్ద గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు.
- తదుపరి బొల్లావులతో స్వాగత పాదయాత్ర ప్రారంభం.
- ఆ తర్వాత ఒంగోలు బస్టాండ్‌లోని దర్గా మసీద్ వద్ద ప్రార్థనలు.
- బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులు.
- కొట్లబజార్ మీదుగా బొడ్డుచావిడి వద్ద గల వినాయకునికి పూజలు, అనంతరం అక్కడే మేధావులు, వ్యాపారస్తులతో సమావేశం.
- ఎమ్మెస్సార్ రోడ్డు, సుగుణమ్మ సెంటర్, వైఎస్సార్ రోడ్డులో కాలేజీ విద్యార్థులతో సంభాషణలు.
- వైఎస్సార్ రోడ్డు మీదుగా, ఓవీ ప్రధాన రోడ్డులో గల ప్రభుత్వ పాఠశాల, కాలేజీల్లో నాడు–నేడు కార్యక్రమంపై విద్యార్థులతో సమీక్ష.
- అనంతరం ప్రధాన ఓవీ రోడ్డు పక్కన గల బాబూ జగ్జీవన్ విగ్రహానికి నివాళులు, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు.
- అనంతరం వైఎస్సార్ భవన్‌లో ప్రెస్ మీట్, తటస్తులతో సమావేశం.
- సాయంత్రం 4 గంటలకు స్థానిక పామూరు బస్టాండ్ (చర్చి సెంటర్)లో బహిరంగ సభ.

వర్షంతో రైతన్న హర్షం

- జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు
- ఆనందంలో రైతులు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో సుమారు నెల రోజుల తర్వాత వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లబడడటంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, మరికొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తుండటంతో రబీ పంటల సాగుకు మేలు జరుగుతుందని రైతులు ఆనందంగా ఉన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు బెట్ట నుంచి ఉపశమనం పొందే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే సాగు చేసిన పొగ నాట్లు, కంది, పత్తి, వరి, జొన్న పంటలకు ఈ వర్షంతో మేలు జరిగే అవకాశం ఉండటంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు ఇలాగే కొనసాగితే రబీలో సాగు చేసే పంటలతో పాటు శనగ, పొగాకు నాట్లు ఊపందుకుంటాయని చెబుతున్నారు.


భారీ వర్షానికి కురిచేడు మండలం ఎస్‌ఎస్పీ అగ్రహారం రోడ్డులో పొంగిపొర్లుతున్న చింతచెట్టు వాగు


తాళ్లూరులో ఊపిరిపోసుకుంటున్న మిరప, జొన్న పంటలు

శుక్రవారం 201.6, శనివారం 194 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు...

జిల్లాలోని 38 మండలాలకుగానూ శుక్రవారం 16 మండలాల్లో 201.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం 22 మండలాల్లో 194 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కురిచేడు మండలంలో 50 మిల్లీమీటర్లు, నాగులుప్పలపాడు 26, కొత్తపట్నం 24.8, వెలిగండ్ల 18, పీసీ పల్లి 9.8, మద్రిపూడి 8.4, సీఎస్ పురం 8.2, కనిగిరి 6, ఒంగోలు 5.4, చీమకుర్తి 5, సింగరాయకొండ 4.2, జరుగుమల్లి 3.6, పొదిలి 3.6, మద్దిపాడు 3.2, ముండ్లమూరు 3.2, పెద్దారవీడు 3.2, తాళ్లూరు 3.2, కొండపి 2, దర్శి 2, టంగుటూరు 1.4, దొనకొండ 1.4, బేస్తవారిపేట 1.4 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

- క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన కలెక్టర్ దినేష్‌కుమార్


క్రీడా జ్యోతిని కలెక్టర్ దినేష్‌కుమార్‌కు అందజేస్తున్న క్రీడాకారులు

ఒంగోలు: అండర్–17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో కలెక్టర్ దినేష్ కుమార్ జాతీయ, రాష్ట్ర, జిల్లా ఎస్‌జీఎఫ్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం జిల్లాలో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కలెక్టర్‌కు క్రీడాజ్యోతి అందించారు. 13 జిల్లాల నుంచి హాజరైన బాలబాలికల నుంచి కలెక్టర్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని, ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమం ద్వారా గ్రామీణ స్థాయి నుంచి క్రీడాకారుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. త్వరలో ఈ కార్యక్రమాలు నిర్వహించనుందన్నారు. క్రీడాకారులకు డార్మిటరీ సౌకర్యం అవసరం ఉందని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ క్రీడలంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. తాను ఉలవపాడు పాఠశాలలో చదువుకునేటప్పుడు క్రీడలు ఆడే విషయాన్ని గుర్తుచేసుకున్నారు. డీఈవో, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా వసతులు కల్పించామన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో రాష్ట్ర జట్టును కూడా ఎంపిక చేసే బాధ్యతను టోర్నమెంట్ పరిశీలకులు జగదీష్‌రెడ్డి స్వయంగా పరిశీలించాలన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కలెక్టర్ సాఫ్ట్‌బాల్ ఆడి ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.వనజ, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌కుమార్, ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌కుమార్, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, పలువురు పీఈటీలు పాల్గొన్నారు.


సాఫ్ట్‌బాల్ ఆడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

మహిళల కోసమే ప్రభుత్వ పథకాలు

- కలెక్టర్ దినేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


ఒంగోలు టౌన్: స్వయం సహాయక సంఘాలలోని మహిళలు వ్యక్తిగతంగా ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. గ్రామీణ మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో మహిళా సమాఖ్యలు కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మహిళా సమాఖ్య సభ్యులతో శనివారం ఒంగోలులోని టీటీడీసీ హాలులో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపిన కలెక్టర్ ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంత మహిళలకు మరింత మెరుగైన జీవనోపాధి కల్పించడంలో మహిళా సమాఖ్యలు కీలకంగా వ్యవహరించాలన్నారు. వ్యవసాయ ఆధారిత జిల్లా కావడంతో మహిళలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించడంపై సమాఖ్యలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంతో పాటు ఇతర పథకాలను ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందేలా గ్రామీణ మహిళలకు చేదోడువాదోడుగా నిలబడాలని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టడంతో వీఓఏలు చురుకైన పాత్ర పోషించాలని చెప్పారు. జిల్లాలో 85 శాతం మహిళలు స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారని, మిగిలిన 15 శాతం మహిళలను కూడా చేర్పించేందుకు తగిన కృషి చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, ఇతర బలహీనవర్గాలకు చెందిన మహిళలంతా కచ్చితంగా ఎస్‌హెచ్‌జీలలో ఉండేలా పర్యవేక్షించాలని చెప్పారు. దేశంలో ఏ వ్యవస్థకు లేని విధంగా 99.5 శాతం రుణాల రీ పేమెంట్ ఘనత స్వయం సహాయక సంఘాలకే దక్కుతుందన్నారు. ఎస్‌హెచ్‌జీలను ఆదర్శంగా తీసుకుని రైతులను సంఘటితం చేసేలా ఎఫ్‌పీజీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,534 వీఓలు ఉన్నాయని, వీటి పరిధిలో 44,320 స్వయం సహాయక సంఘాలు పనిచేస్తున్నాయని డీఆర్‌డీఏ పీడీ తేళ్ల రవికుమార్ తెలిపారు. మొత్తం 4,46,776 మంది మహిళలు ఈ సంఘాలలో సభ్యులుగా ఉన్నారన్నారు. ఏ గ్రేడ్‌లో 66.65 శాతం మంది, బీ గ్రేడ్‌లో 24.08 శాతం ఎస్‌హెచ్‌జీలు ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

ఒంగోలు సబర్బన్: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన ఒంగోలు నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వన్‌టౌన్ ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు... కర్నాటక రాష్ట్రానికి చెందిన సుధాకర్ అనే యువకుడు కొన్ని సంవత్సరాల నుంచి ఒంగోలు నగరంలో ఉంటున్నాడు. ఒంటరిగా ఉంటున్న సుధాకర్ గతంలో వేరే ప్రాంతంలో నివాసం ఉంటూ ఆ తర్వాత కేశవస్వామిపేటలో ఒక రూము అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. ఇతని ఆధార్ కార్డు కూడా ఒంగోలు అడ్రస్‌తోనే ఉంది. ఈ నేపథ్యంలో ఏం జరిగిందో ఏమోగానీ అతను ఉంటున్న రూములోనే మరణించి తాడుకు వేలాడుతున్నాడు. అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.లక్ష్మణ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

మల్బరీతో అధిక లాభాలు

యర్రగొండపాలెం: మల్బరీ తోటలు సాగు చేసుకునే రైతులు ప్రతి నెలా లాభాలు పొందవచ్చని, 3 ఎకరాల్లో సాగుచేసిన రైతుకు నెలకు రూ.50 వేల వరకు రాబడి ఉంటుందని ఏపీ పట్టుపరిశ్రమ అడిషనల్ డైరెక్టర్ సి.అరుణకుమారి అన్నారు. శనివారం యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లోని కాశీకుంట తండా, సాయిబాబా నగర్, పెద్ద పీఆర్సీ తండా, చిన్న పీఆర్సీ తండాల్లో విస్తృతంగా పర్యటించి మల్బరీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరోనా సీజన్ నుంచి చైనా నుంచి పట్టు దారం దిగుమతి చాలా వరకు తగ్గిపోయిందని, స్థానికంగా ఉత్పత్తి చేసే పట్టుకు మంచి డిమాండ్ ఉందన్నారు. కిలో పట్టు దారం రూ.525 వరకు పలుకుతోందని ఆమె తెలిపారు. మల్బరీ తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని, 75 శాతం సబ్సిడీ కింద ఈ సంవత్సరం రూ.16 కోట్లు ఆర్థిక సహాయం చేసిందని ఆమె తెలిపారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి డాక్టర్ సుజైన్ కుమార్, మార్కాపురం సహాయ సంచాలకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.


మల్బరీ తోటలను పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి

'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన


క్విస్ ఉన్నత పాఠశాలలో సాక్షి స్పెల్‌బీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


గౌతం మోడల్ స్కూల్‌లో...

ఒంగోలు: సాక్షి స్పెల్‌బీకి శనివారం విశేషంగా స్పందన లభించింది. స్థానిక కర్నూలు రోడ్డులోని క్విస్ హైస్కూల్, స్థానిక భాగ్యనగర్‌లోని గౌతం మోడల్ స్కూళ్లలో ఈ పరీక్ష జరిగింది. ప్రథమ రౌండ్ పోటీని మొత్తం నాలుగు విభాగాలుగా నిర్వహించారు. మొదటి విభాగాన్ని 1, 2 తరగతులు, రెండో విభాగం 3, 4 తరగతులు, మూడో విభాగం 5, 6, 7 తరగతులు, నాలుగో విభాగాన్ని 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభకు పదునుపెట్టుకున్నారు. ఈ సందర్భంగా సాక్షి అడ్వర్టయిజింగ్ అసిస్టెంట్ మేనేజర్ శర్మ మాట్లాడుతూ ప్రథమ రౌండ్‌లో విజయం సాధించిన వారిని రెండో రౌండ్‌కు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. రెండో రౌండ్‌ను జిల్లాస్థాయిలో ఒంగోలులో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా క్విస్ ఉన్నత పాఠశాలలో పరీక్షలను క్విస్ సీఈవో వేణు, ప్రిన్సిపాల్ నాగరాజు, టీచింగ్‌స్టాఫ్ శ్యామ్, అనూష, రాము, అడ్మిన్ మేనేజర్ స్వాతి, గౌతం మోడల్ స్కూల్లో సాక్షి అడ్వర్టయిజింగ్ సీనియర్ ఆఫీసర్ వి.భాస్కరరెడ్డి నేతృత్వంలో కరస్పాండెంట్ ఎం.కొండయ్య, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ శృతి, ఉపాధ్యాయులు బి.జ్యోతి, పి.అలేఖ్య, బి.సంధ్య పర్యవేక్షించారు.

స్పెల్‌బీ పోటీలు ఎంతో ఉపయోగకరం



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పోటీలు మాకు ఎంతో ఉపయోగకరం. మా శక్తి సామర్థ్యాలను మేం తెలుసుకునేందుకు దోహదం చేస్తోంది. నిజంగా ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సాక్షి యాజమాన్యానికి కృతజ్ఞతలు.

– విధిష, 8వ తరగతి, క్విస్ ఉన్నత పాఠశాల

ఆంగ్లంపై పట్టు పెంచుకునేందుకు దోహదం



ఆంగ్లంపై పట్టు పెంచుకునేందుకు సాక్షి స్పెల్‌బీ పోటీలు ఉపయోగకరంగా ఉన్నాయి. ఆంగ్లంపై పట్టు కలిగి ఉండటంతో పాటు దానిని ఎలా, ఎక్కడ వినియోగించాలనే దానిపై ఇస్తున్న ప్రశ్నలు, ఒకే రకమైన ఉచ్ఛరణ కలిగిన పదాలు, వాటి స్పెల్లింగ్‌లు వంటి అంశాలు ఎంతగానో ఆలోచింపజేస్తున్నాయి.

– సమీర, క్విస్ ఉన్నత పాఠశాల, 8వ తరగతి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు

ఒంగోలు సెంట్రల్: జిల్లాలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం అన్ని కార్పొరేషన్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న జగనన్న చేదోడు, ఈబీసీ నేస్తం, కాపు నేస్తం, జగనన్న తోడు, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, మత్స్యకార భరోసా, వైఎస్సార్ బీమా, నేతన్న నేస్తం, వాహన మిత్ర, కళ్యాణ మస్తు, షాదీ తోఫా వంటి సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఈ కేవైసీ పూర్తి చేయించాలని కోరారు. ఇప్పటి వరకు 85–90 శాతం ఈ–కేవైసీ పూర్తయిందని, ఇంకా పూర్తి కావాల్సిన వాటిని క్షేత్రస్థాయి సిబ్బందితో పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు తప్పనిసరిగా సచివాలయాలను సందర్శించి అక్కడ నిజమైన లబ్ధిదారులు ఎవరైనా ఉండి లబ్ధిపొందనట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎస్టీ కార్పొరేషన్ ఈడీ జగన్నాథరావు, మైనార్టీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, హ్యాండ్ ల్యూమ్స్ ఏడీ ఉదయ్‌కుమార్, డీటీసీ సుశీల, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు